

ఇల వైకుంఠం మురిసింది.. భక్తజన సంద్రంలో ఓలలాడింది.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి కరుణాకటాక్షాలు.. మిన్నంటిన గోవింద నామస్మరణలతో సప్తగిరులు పులకించాయి. నీ కీర్తన శ్రవణానంద దాయకం.. నీ సాకారం నయనానందకరం.. నీ ప్రసాదం జిహ్వానందదాయకం.. అంటూ ఆ శ్రీనివాసుడి సేవలో తన్మయానందభరితులయ్యారు. తనకు అత్యంత ఇష్టమైన గరుడ వాహనం అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ ఉభయ దేవేరులతో ఆ మలయప్పస్వామి అభయప్రదానం చేస్తుండగా.. లక్షలాది మంది భక్తులు జయజయధ్వానాలు పలికారు. మూర్తీభవించిన ఆ విశ్వాంతర్యామి వైభవాన్ని కనులారా వీక్షించి.. మనసారా స్మరించి భావోద్వేగంతో పులకించారు.



- న్యూస్‌టుడే, తిరుమల

భక్తులే కొండంతా..

ప్రణమిల్లిన గరుడుడు.. శోభిల్లిన దేవదేవుడు

తిరుమలలో మిన్నంటిన గోవింద నామస్మరణ

శ్రీహరే మనసంతా





గరుడ వాహన సేవలో భక్తజన సందోహం

మలయప్పస్వామివారు మంగళవారం ఉదయం మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భజనలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠి, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. రాక్షసులను మోహింపజేసిన జగన్నాథుడు జగన్మోహినిగా బంగారు పల్లకిలో సిగ్గులు ఒలకబోస్తూ కనువిందు చేశారు. క్షీరసాగర మథనంలో లభించిన అమృతాన్ని దేవతలకు పంచిపెట్టడానికి స్వయంగా బంగారు వాలుజడ ధరించి, భువన మోహన రూపిణియై మోహినీ అవతారాన్ని దాల్చారు. ఈ అలంకారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగి ఉందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలో లులు కాకతప్పదని స్వామివారు ఈ రూపంలో చాటి చెబుతున్నారు.

దాసానుదాస ప్రవృత్తికి దాసుడై



మలయప్ప స్వామివారు సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని చెబుతారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తికోరే మానవులు గరుడున్ని దర్శిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తకోటికి సందేశాన్నిచ్చారు. స్వామివారి వాహనాన్ని స్వయంగా తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి మోశారు.



మోహినీ అలంకారం, మరో తిరుచ్చిపై కృష్ణస్వామి

నేడు స్వర్ణ రథోత్సవం
స్వర్ణ రథోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా జరగనుంది.

● బుధవారం ఉదయం హనుమంత, రాత్రి గజవాహన సేవలు జరగనున్నాయి.



గరుడోత్సవ విశేషాలు

➡ శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీల్లో ఉదయాన్నే భక్తులు నిండిపోయారు. మధ్యాహ్నం ఎండవేడిమికి తట్టుకోలేక గొడుగులు, చీరలు అడ్డుపెట్టుకున్నారు. సాయంత్రం గుడి ఆవరణలో వర్షం కురవడంతో భక్తులు ఉపశమనం పొందారు.

➡ గ్యాలరీల్లో చేసిన ఏర్పాట్లపై ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి భక్తులతో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించారు.

➡ ప్రత్యేక వాహనంలో వైద్యులు, సిబ్బంది భక్తులకు అందుబాటులో ఉంటూ మందులు అందజేశారు.

➡ తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో వాహనాలను జీఎన్‌సీ నుంచి రింగురోడ్డు మీదుగా మళ్లించారు. భక్తులు అక్కడి నుంచి నడుచుకుంటూ మాడవీధులకు తరలివెళ్లారు. గరుడసేవను సుమారు మూడు లక్షల మంది భక్తులు వీక్షించినట్లు అంచనా.

➡ తప్పిపోయిన ఎనిమిది మంది భక్తులను జియో ట్యాగ్ సాయంతో వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ సౌజన్య తెలిపారు.


➡ గ్యాలరీల్లోకి రాలేని భక్తులను సాయంత్రం ఒక్కసారిగా అనుమతించడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు ఈ ప్రదేశంలో ముందు జాగ్రత్త చర్యల్లో విఫలమైనట్లు భక్తులు ఆరోపించారు.

➡ దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులు 200 గ్యాలరీల్లోని దాదాపు రెండు లక్షల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ తిరుపతి నుంచి 404 బస్సుల్లో 5,145 ట్రిప్పులతో 1,77,577 మంది భక్తులను తిరుమలకు తరలించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్ రెడ్డి తెలిపారు.



భక్తులను గ్యాలరీల్లోకి అనుమతిస్తున్న పోలీసులు



నిఘా నేత్రాలతో భద్రత పర్యవేక్షిస్తూ..



భక్తులతో మాట్లాడుతున్న ఈవో, ఏఈవో



అల్పాహారం పంపిణీ చేస్తూ..



ఎండ వేడిమిని తప్పించుకునేందుకు..

14 నుంచి 'పల్లె పండుగ'

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో గ్రామీణ రహదారుల నిర్మాణం, పశు సంపద అభివృద్ధి లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,356 సీసీ రోడ్లు, 14 బీటీ రోడ్ల పనులకు మంజూరు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

రూ.49కే కిలో టమాటా

నేటి నుంచి రైతుబజారులో విక్రయం



చిత్తూరు (వ్యవసాయం): ధరల నియంత్రణలో భాగంగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై నాణ్యమైన కిలో టమాటా రూ.49కే రైతుబజారులో అందజేయనున్నారు. బుధవారం ఉదయం చిత్తూరు రైతుబజారులో టమాటా విక్రయ కౌంటర్‌ను ప్రారంభించనున్నామని జేసీ విద్యాధరి తెలిపారు. త్వరలో రాయితీపై ఉల్లిపాయల పంపిణీ కౌంటర్‌ను రైతుబజారులో ప్రారంభిస్తామని ఆమె చెప్పారు.

పంపిణీకి సిద్ధంగా నారు

కుప్పంలోని సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)లో నాణ్యమైన 10 లక్షల టమాటా నారు మొక్కలు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తెగుళ్లు తట్టుకుని.. నాణ్యమైన అధిక దిగుబడులు ఇచ్చే ఈ నారు మొక్కలను సీవోఈలో సిద్ధం చేశామన్నారు. అవసరమైన రైతులు ఆయా ప్రాంతాల్లోని ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

దారులన్నీ గరుడ కూడలి వైపు

- ద్విచక్ర, ట్యాక్సీ వాహనాల నిషేధం
- సొంత వాహనాలు 4.35కు నిలుపుదల



గరుడ కూడలి వద్ద వాహన పాసులు పరిశీలించి అనుమతిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం, జీవకోన), న్యూస్‌టుడే: గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర స్వామి కటాక్షం కోసం భక్తకోటి దారులన్నీ అలిపిరి గరుడ కూడలి వైపు కదిలాయి. తిరుమలలో వాహన సామర్థ్యం నిండిపోయిందని నిలిపివేసేలా వాహన రద్దీ నెలకొంది. గరుడ వాహన సేవ రోజు భక్తుల తాకిడిని గుర్తించిన తితిదే, పోలీసు శాఖ మంగళవారం ద్విచక్ర వాహనాలు, ట్యాక్సీలను పూర్తిగా ఘాట్ రోడ్డులో నిషేధించారు. ముందు రోజు రాత్రి నుంచి గరుడ వాహన సేవ మరుసటి రోజు ఉదయం వరకు నిషేధాజ్ఞలు కొనసాగాయి.

తిరుమలలో 8 వేల వాహనాల పార్కింగ్ సామర్థ్యం పూర్తికావడంతో మంగళవారం సాయంత్రం 4.35 నిమిషాలకు ఘాట్ రోడ్డులో సొంత వాహనాలను కూడా నిలిపివేశారు. వాహన పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు వెంకట నారాయణ, రామకృష్ణాచ్చారి, అలిపిరి, తిరుపతి పడమర సీఐలు రామ్‌కిషోర్, రామకృష్ణల అలిపిరి టోల్‌గేట్ వద్ద పర్యవేక్షించారు. వాహన పాసులు లేకుండా గరుడ సర్కిల్ వద్దకు వచ్చిన పలువురు ప్రముఖులు, అధికారుల వాహనాలను వెనక్కు పంపారు. దూర ప్రాంతాల నుంచి బస్సులు, వాహనాలలో వచ్చిన భక్తులు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలను ఉంచి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమల వెళ్లారు. దేవలోక్, భారతీయ విద్యాభవన్, ఎస్వీ సీ ఇంజినీరింగ్ కళాశాల, ఇస్కాన్, బాలాజీ బస్టాండు, నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసి తిరుమలకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం లోపే పెద్ద సంఖ్యలో భక్తులు, వాహనాలు తిరుమల చేరుకున్నాయి. సాయంత్రం 4.35 తర్వాత ఆర్టీసీ బస్సుల్లో భక్తులు తిరుమల వెళ్లారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు



శ్రీవారి ఆలయం ఎదుట ఎండవేడిమికి చీరలు కప్పుకొని, గొడుగులు పట్టుకుని రక్షణ పొందుతున్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో మంగళవారం తిరుమల నాదనీరాజనం, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గరుడసేవ రోజున భారతీయ విద్యాభవన్ బృందం శ్రీ లక్ష్మీ, విష్ణుసహస్రనామ పారాయణం, గోవిందనామాలు, నామసంకీర్తన భజనలు నిర్వహించారు. ఆర్.వాణిశ్రీ, ఓవి జలజాక్షి, కళానాగరాజ్, పి.విద్యాలత, ఎస్.సుధ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట గరుడ వాహన సేవ వీక్షిస్తున్న భక్తజనం

కిక్కిరిసిన శ్రీవారిమెట్టు



మెట్టు మార్గంలో భక్తజనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: గరుడ సేవను వీక్షించడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులతో శ్రీవారిమెట్టు మార్గం కిక్కిరిసిపోయింది. మెట్టు మార్గంలో తరలివెళ్లిన భక్తులకు పాదాల మండపం వద్ద గోవిందసేవా మండలి ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం ఏర్పాటు చేసింది. నిర్వాహకులు శ్రీనివాసులునాయుడుస్వామి మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు.

నేను సైతం.. భక్తులకు పహారా

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాలకు పాదయాత్రతో మెట్ల మార్గంలో తరలివచ్చే భక్తులకు రక్షణగా తితిదే అటవీశాఖ ఆధ్వర్యంలో వైల్డ్ అనిమల్ సెన్సార్లు, షాక్ పరికరాలను సిబ్బందికి సమకూర్చింది. మంగళవారం గరుడసేవ సందర్భంగా శ్రీవారిమెట్టు, అలిపిరి నడక మార్గాల్లో అటవీ కార్మికులు సెన్సార్లతో రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. ఈ పరికరం 10 అడుగుల దూరంలో ఏదైనా వన్యప్రాణికానీ, చిరుతలు, ఎలుగు బంట్లు ఉన్నా గుర్తిస్తుంది. తద్వారా పరికరాన్ని నిర్వహించే కార్మికుడు సైరన్ మోగించి, వన్యప్రాణులను భయపెట్టే ప్రయత్నం చేస్తాడు. సమీపంలో ఉండే తోటి కార్మికులను అలర్ట్ చేస్తారు. పరికరం చివర భాగంతో పది అడుగుల దూరం నుంచే వన్యప్రాణికి షాక్ కొట్టించి, అక్కడి నుంచి పారిపోయేలా చేయచ్చు.



వైల్డ్ అనిమల్ సెన్సార్‌తో అటవీ కార్మికుడు

మునిగణ వందిత.. మోక్షప్రదాయని



ధనలక్ష్మీదేవిగా గంగమ్మ

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: ఓం మునిగణ వందిత మోక్షప్రదాయని అంటూ అమ్మవారి నామస్మరణతో బోయకొండ మార్మోగింది. మంగళవారం బోయకొండ గంగమ్మ.. ధనలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బెంగళూరు ఎమ్మెల్సీ రామోజీగౌడ ఉభయదారుడిగా పూజలు చేశారు. గోశాలకు రూ.25వేల విరాళాన్ని ఈవో ఏకాంబరానికి అందజేశారు.

ఉగ్రరూపిణి.. వ్యాఘ్రాసుర సంహారిణి



వ్యాఘ్రాసురుని సంహరించేందుకు జ్ఞానాంబిక ఉగ్రరూపిణిగా దర్శనమిచ్చారు. వ్యాఘ్రాసుర సంహారంతో అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. ముక్కంటి ఆలయం నుంచి బాలజ్ఞానాంబికను ఆలయం వద్దకు తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. - **న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

అన్నపూర్ణదేవిగా మరగదాంబిక



కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీమరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

మణికంఠేశ్వరుడికి పంచలోహ ఆభరణాల వితరణ



ఆభరణాలు అందజేస్తున్న కేవీ మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి వారికి రూ.2.40 లక్షల విలువ చేసే పంచలోహ నాగాభరణం, ముఖ కవచాన్ని కాణిపాకం పంచాయతీ మాజీ సర్పంచి కేవీ మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులతో కలసి ఈవో రవీంద్రబాబుకు అందించారు. ఆలయ మర్యాదల ప్రకారం వారికి స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.

కనకదుర్గకు పట్టువస్త్రాల సమర్పణ



సారె తెస్తున్న కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

ఇంద్రకీలాద్రి, కాణిపాకం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని జగన్మాత దుర్గమ్మకు కాణిపాకం వినాయక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, సారెను మంగళవారం సమర్పించారు. ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మేళతాళాల నడుమ సారెను ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు.

గరుడిపై వరద రాజసం



కాణిపాకం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం శ్రీవరదరాజస్వామి వారు ఉభయదేవేరులతో కలసి గరుడ వాహనంపై ఊరేగుతూ మంగళవారం రాత్రి భక్తులను కటాక్షించారు. ఉత్సవమూర్తులను సర్వాలంకృతులను చేసి మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకానికి చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.

గణనాథుడి సేవలో సీఎం కార్యదర్శి



సీఎం కార్యదర్శి ప్రద్యుమ్నకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏఈవో రవీంద్రబాబు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని సీఎం చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, చిత్తూరు ఆర్డీఈవో శ్రీనివాసులు, సూపరింటెండెంట్ వాసు ఉన్నారు.

15లోగా దరఖాస్తులు అందజేయాలి

చిత్తూరు విద్య: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 15 బోధనేతర పోస్టులను పొరుగుసేవల కింద భర్తీ చేసేందుకు అర్హులైన వారు ఈ నెల 15లోగా ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు.

21లోగా శిక్షణ సంస్థలు..

చిత్తూరు(జిల్లా పంచాయతీ): డీఎస్సీ అభ్యర్థుల శిక్షణ కోసం కోచింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి రాజ్యలక్ష్మి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను https:///tender.apeproure-ment.gov.in లో అప్‌లోడ్ చేశామని, ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 21 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరీక్ష ఫలితాల విడుదల

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఆగస్టులో నిర్వహించిన బీఈడీ(స్పెషల్) కోర్సు మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

చిత్తూరు-పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రా

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా కడప కేఎస్‌ఆర్ఎం మైదానంలో చిత్తూరు, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 132/3తో మొదటి ఇనింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన చిత్తూరు జట్టు 329/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప.గో. జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 130/3 స్కోరు చేసింది. ప.గో.జట్టు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 120.

నేడు అపోలో వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాల్లో 'మెంటల్ హెల్త్ మేటర్స్ అట్ వర్క్' అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ ఛాన్స్‌లర్ వినోద్‌భట్ తెలిపారు. నగరంలోని అపోలో విశ్వవిద్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు. వర్సిటీ రిజిస్ట్రార్ పోతరాజు, సీనియర్ క్లినికల్ సైకాలజిస్టు ఫౌండర్ భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో 1,215 మందికి పీజీ ప్రవేశాలు

తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూ పరిధిలో రెండో విడత పీజీ ప్రవేశాలు అక్టోబర్ 4 నుంచి 7 వరకు జరిగాయని, విశ్వవిద్యాలయంలో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం తెలిపారు. ఏపీ పీజీసెట్ 2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ధ్రువపత్రాలు పరిశీలించారని, మొత్తం 2,080 సీట్లు ఉండగా 1,215 మంది చేరినట్లు వెల్లడించారు. ఆర్ట్స్ 267, సైన్స్ 576, కామర్స్ 108, మేనేజ్‌మెంట్, 132, ఎంసీఏ విభాగంలో 132 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని, 59 శాతం మంది చేరినట్లు వర్సిటీ డీవోఏ డైరెక్టర్ ఆచార్య రమేష్‌బాబు వెల్లడించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

దేశ భద్రతకు బలీయమైన శక్తి ఐఏఎఫ్



ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దేశ భద్రతకు బలీయమైన శక్తి భారత వైమానిక దళమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. 92వ ఐఎఎఫ్ దినోత్సవం సందర్భంగా భారత వైమానిక దళ సేవలను ఆయన కొనియాడారు. 1932 అక్టోబరు 8న పురుడు పోసుకున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఏఎఫ్) జాతీయ భద్రతకు సంబంధించి బలీయమైన శక్తిగా ఉన్నట్లు తెలిపారు.

104 మద్యం దుకాణాలకు 1,224 దరఖాస్తులు

- ఖజానాకు రూ.24.48 కోట్లు
- నేటితో ముగియనున్న గడువు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లాలో ఏర్పాటు కానున్న 104 ప్రైవేటు మద్యం దుకాణాలకు 1,224 దరఖాస్తులు అందగా.. వాటితోనే ప్రభుత్వ ఖజానాకు రూ.24.48 కోట్ల ఆదాయం చేరింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటికి 818 దరఖాస్తులు అందగా.. మంగళవారం ఒక్క రోజే 404 దరఖాస్తులు అందాయి. బుధవారం దరఖాస్తుల గడువు పూర్తి కానుండడంతో రెట్టింపు దరఖాస్తులు అందే అవకాశాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఒత్తిడితో కొందరు దరఖాస్తు చేయడానికి ముందుకు రాలేదనే విమర్శలు లేకపోలేదు. అందులో ప్రధానంగా పుంగనూరు, నగరిలో ఈ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.

కొన్నిచోట్ల ఒక్కటే

ప్రైవేటు మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను ఆహ్వానించి వారం రోజులు గడుస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో నేటికీ సింగిల్ దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అందులోనూ 1, 2, 3 దరఖాస్తులు వచ్చి దుకాణాలు అధికంగా ఉండగా.. 9 అంకెల లోపు ఉన్న దరఖాస్తులు వాటి కంటే అధికంగానే ఉన్నాయి. ప్రధానంగా నగరి, సదుంలో నాలుగు దుకాణాలకు ఒక్కోటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. పూతలపట్టు, నగరి, రొంపిచెర్ల ప్రాంతాల్లో 5 దుకాణాలకు రెండు చొప్పున అందాయి. పుంగనూరు, నగరి, నింద్ర, పెద్దపంజాణి, పులిచెర్ల ప్రాంతాల్లోని 5 దుకాణాలకు మూడు చొప్పున వచ్చాయి. దరఖాస్తులు రాని ప్రాంతాల్లో నాయకుల ఒత్తిడి తగ్గించడానికి ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఆఖరి రోజు అయినా దరఖాస్తులు వస్తాయా లేదా అని వేచి చూడాల్సి ఉంది.

నేడు విద్యుత్తు సమస్యలపై వినతుల స్వీకరణ

చిత్తూరు(మిట్టూరు): విద్యుత్తు శాఖ తిరుపతి సర్కిల్ పరిధిలోని ఎనిమిది డివిజన్, 27 సబ్-డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నామని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌కు సంబంధించి స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ, సబ్- డివిజన్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామని ఈఈ మునిచంద్ర చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి బడ్డిగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు శివ (35) మంగళవారం రోడ్డు ప్రమాదంలో చెందారు. పుంగనూరు నుంచి మదనపల్లె మార్గంలో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో శివ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో ఖాళీ కుర్చీలు

తనిఖీలో అవాక్కైన జడ్పీ ఛైర్మన్



సిబ్బంది లేకుండా ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: పెద్దపంజాణి మండలం శంకరాయలపేట గ్రామ సచివాలయాన్ని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2.30 గంటల సమయంలో కార్యాలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ తలుపులు తెరిచి సిబ్బంది ఇష్టానుసారంగా వెళ్లిపోయారని.. ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. రికార్డులు, కంప్యూటర్లు అపహరణకు గురైతే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందికి నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు.

మెరుగైన సేవలు అందించాలి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: గర్భిణుల్లో హైరిస్క్ కేసులను గుర్తించి, వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా టీకాల అధికారి హనుమంతరావు తెలిపారు. చిత్తూరు నగరం కాజూరు అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఆశా నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ప్రసూతి సేవలపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిన్న వయసులో గర్భం దాల్చి ప్రసూతి సేవల కోసం వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ప్రభావతిదేవి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

టెట్‌కు 398 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు కేంద్రాల్లో మంగళవారం టెట్ నిర్వహించగా 398 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్వీసెట్ కళాశాలలో 200 మందికి గాను 187 మంది, మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో 260 మందికి గాను 211 మంది హాజరయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, పాలసముద్రం

సమస్య: క్రిష్ణజిమ్మాపురం పంచాయతీ బలిజకండ్రిగ ప్రధాన కూడలి వద్ద చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. **- వేలు, బలిజకండ్రిగ**

సమాధానం: చెత్తకుండీ ఏర్పాటు చేయిస్తాం.
- జయశంకర్, పంచాయతీ కార్యదర్శి, పాలసముద్రం

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: మురకంబట్టులో నివాసాల మధ్య డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**

సమాధానం: కాలువలో పూడిక తొలగింపజేస్తాం.
- అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

న్యూస్‌టుడే, పుత్తూరు

సమస్య: పుత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపురంలో చెత్త తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఎక్సైజ్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో చంద్రగిరి ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం చిత్తూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఈ నెల 1 నుంచి ఇప్పటి వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానం ద్వారా చంద్రగిరి ఎక్సైజ్ పరిధిలో 17 ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు 57 దరఖాస్తులు అందాయని సీఐ కేవీఎస్ ఫణీంద్ర అధికారులకు వివరించారు. తిరుపతి జిల్లా ఎక్సైజ్‌శాఖ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, చంద్రగిరి ఎక్సైజ్ శాఖ ఎస్సైలు సుధాకర్‌రావు, గిరి, సిబ్బంది పాల్గొన్నారు.


ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

విద్యుత్ సరఫరాలో అంతరాయం వద్దు

పూతలపట్టు, న్యూస్‌టుడే: విద్యుత్ అంతరాయం లేకుండా వినియోగదారులకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆ శాఖ ఏడీఈ శేషాద్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఏడు విద్యుత్ సబ్ స్టేషన్లకు పాకాల నుంచి సరఫరా అవుతున్న 33 కేవీ లైన్లను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తూ పేటమిట్ట ఉప కేంద్రానికి వెళ్లి రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఏఈ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త పన్ను చీటీ చిరిగింది

☛ ముక్కుపిండి పన్ను వసూలు చేసిన గత ప్రభుత్వం
☛ రద్దుతో నగరవాసులకు ఉపశమనం

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: పట్టణాల్లో చెత్త పన్నును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన నగరంలోని పది వేల మందికి ఉపశమనం లభించింది. గత వైకాపా ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి ఇంటింటా చెత్త సేకరణ నిమిత్తం నగరపాలక యంత్రాంగం యూజర్ ఛార్జీల పేరుతో పన్ను వసూలు చేసింది. దీనిపై విమర్శలు ఎదురైనప్పటికీ ముందుకే సాగింది. వాస్తవానికి ఇంటి పన్నులోనే చెత్త సేకరణ, వీధుల శుభ్రతకు ఇది వరకు ప్రత్యేకంగా చెల్లిస్తున్నప్పటికీ మళ్లీ చెత్తపై పన్నును వైకాపా ప్రభుత్వం వసూలు చేసింది. తెదేపా ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో హర్షం వ్యక్తమవుతోంది.

క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమంలో భాగంగా నగరంలోని 1, 4, 5, 7, 9, 16, 17, 18, 32, 34, 39.. ఇలా మొత్తం 11 డివిజన్లలో గత ప్రభుత్వంలో చెత్త పన్ను వసూలు చేశారు. స్వచ్ఛ భారత్ అమల్లో భాగంగా ఇళ్ల నుంచి నేరుగా చెత్త సేకరించడానికి ప్రత్యేకంగా మినీ ఆటోలను సైతం సంబంధిత డివిజన్లకు కేటాయించారు. ఇంటింటా చెత్త సేకరిస్తున్నా వీధుల్లో వ్యర్థాలు ఎక్కడికక్కడే పేరుకుపోయేవి. క్లాప్ అమల్లోకి వచ్చిన తర్వాత గతంలో మాదిరి చెత్త కుండీలు లేకపోవడంతో.. ప్రజలు ఇళ్లలోని చెత్తను వీధుల్లో ఓ మూల వేసేశారు. వీధుల్లో దుర్గంధం వెదజల్లుతున్నా యూజర్ ఛార్జీల వసూలు మాత్రం ఆగలేదు. వాణిజ్య ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. పన్ను చెల్లిస్తున్నా.. సకాలంలో చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.



మినీ ఆటోలో చెత్త తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

ఉత్పత్తి ఆధారంగా వసూలు

11 డివిజన్లలో దాదాపు పది వేల హౌస్‌హోల్డ్స్ నుంచి చెత్త సేకరిస్తుండగా.. మురికివాడలు రూ.30, సాధారణ నివాస ప్రాంతాల్లో రూ.70, దుకాణాల నుంచి రూ.200, హోటళ్ల నుంచి రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు, కల్యాణ మండపాలు, రెస్టారెంట్ల నుంచి చెత్త ఉత్పత్తి ఆధారంగా రూ.2500 వరకు యూజర్ ఛార్జీ వసూలు చేశారు. ఏడాదికి రూ.99 లక్షల వరకు క్లాప్ అమలు చేస్తున్న డివిజన్లలో యూజర్ ఛార్జీలను వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శుల ద్వారా నగరపాలక సంస్థ వసూలు చేసింది. ఇదే సమయంలో ప్రజల నుంచి వ్యతిరేకతను సైతం గత వైకాపా ప్రభుత్వం మూటగట్టుకుంది. తాజాగా చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటనతో పన్ను చెల్లిస్తున్న ప్రజలకు ఊరట లభించింది.

చిత్తూరు చేరిన రసాయన ఎరువులు

చిత్తూరు(వ్యవసాయం): రానున్న రబీ సీజన్ అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రం చిత్తూరుకు మంగళవారం రసాయన ఎరువులు చేరాయి. యూరియా 301 టన్నులు, డీఏపీ 701 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 319 టన్నులు చేరినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఎరువులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు డీలర్లు, మార్క్‌ఫెడ్‌కు కేటాయించామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 6-7 వేల టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని.. అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.

స్పందించారు.. పరిష్కరించారు


దొడ్డిపల్లిలోని కాలువలో పూడికతీత పనుల్లో కార్మికులు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలు.. కాలువల నుంచి వీధి దీపాలు, పేరుకుపోయిన వ్యర్థాలు తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ఈనాడు-మీతోడు' విభాగం తన వంతు సహకారాన్ని అందించింది.. ఆయా ప్రాంతాల్లోని స్థానిక సమస్యల్ని ప్రజలు 'ఈనాడు' దృష్టికి తీసుకువచ్చారు.. సమస్యల్ని ప్రచురించి నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాక సంబంధిత సమస్యల పరిష్కారానికి భాగస్వామ్యం అందించింది.

❖ స్థానిక గిరింపేట కాలనీలో డ్రైనేజీలో చెత్త, వ్యర్థాలు పూడిపోయాయి. ఈ సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలో పూడిక తొలగించారు.

❖ కట్టమంచిలోని కాలువలో చెత్త, వ్యర్థాలతో పూడి మురుగునీరు రోడ్డుపైకి చేరింది. స్థానికుల ఫిర్యాదుతో 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారులు స్పందించి కాలువలో పూడిక తీయించారు.

❖ దొడ్డిపల్లిలో డ్రైన్‌లో వ్యర్థాలు పూడిపోయాయి. స్థానికుల ఫిర్యాదుతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలో పూడికతీత పనులు చేపట్టారు.

❖ మసీదు మిట్టలో వీధి శునకాల బెడద కారణంగా స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై అందిన ఫిర్యాదుతో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు వీధి శునకాలను బంధించి ఏఆర్‌వీ టీకా వేయించారు.

'కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

పుత్తూరు, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా సుంకువారిసత్రం వద్ద గల ఓ మొబైల్ కంపెనీలో 1,200 మంది ఒప్పంద కార్మికులను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. పుత్తూరులోని కార్వేటినగరం రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కంపెనీలో నగరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల యువకులు పని చేస్తున్నారన్నారు. ఎలాంటి కారణం లేకుండా వారిని తొలగించడాన్ని, కార్మికుల మద్దతుగా తాము నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే తాము నిరసన ఉద్ధృతం చేస్తామన్నారు. నాయకులు విజయ్, కృష్ణమూర్తి, రమేష్, చిరంజీవి, శివ పాల్గొన్నారు.

12 మండలాల్లో వర్షం

చిత్తూరు(వ్యవసాయం): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం రాత్రి జిల్లాలోని 12 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పాలసముద్రం మండలంలో 34.4 మి.మీటర్లు, బైరెడ్డిపల్లెలో 6.2, పలమనేరు 5.2 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

పసిప్రాణాలతో చెలగాటమా..!



స్థానిక పంచాయతీ శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పాత భవనం శిథిలావస్థకు చేరింది. దీని పక్కనే ఉన్న మరో భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అదే ఆవరణలోనే అంగన్‌వాడీ పిల్లల భవనం ఉంది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని ఏళ్లు గడుస్తున్నా నేటికీ దాన్ని పట్టించుకోకుండా అలానే వదిలేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారుల ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
-న్యూస్‌టుడే, పాలసముద్రం

శేషవాహనంపై లక్ష్మీనారాయణస్వామి

జీడీనెల్లూరు: వేపంజేరి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శేషవాహనంపై, రాత్రి సింహ వాహనంపై ఊరేగారు. ఉభయదారులుగా అమెరికాలో స్థిరపడ్డ కృష్ణకుమార్ వ్యవహరించగా, హైదరాబాద్‌కు చెందిన రాంప్రసాద్, రాఘవన్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తెరణి గ్రామ సమస్య పరిష్కరిస్తాం

నగరి, న్యూస్‌టుడే: మండలంలోని కుశస్థలినది ఒడ్డున తెరణి గ్రామస్థుల నిత్య సమస్యగా మారిన, ఇసుక అక్రమ రవాణపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. నగరి తహసీల్దార్ రవికుమార్, సీఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం గ్రామానికి వెళ్లి గ్రామస్థులతో చర్చించారు. ఇసుకను తెరణి శ్మశానం సమీపంలో తోడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బ్రిడ్జి సమీపంలో ఇసుకను తోడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎంపీడీవోగా శివప్రసాద్‌వర్మ



నింద్ర, న్యూస్‌టుడే: నూతన ఎంపీడీవోగా శివప్రసాద్‌వర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఉపాధి హామీ పథకంలో కోడూరు ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.


చిత్తూరు: మదురై మీనాక్షి అలంకరణలో అంకాళ పరమేశ్వరి



చిత్తూరు: కట్టమంచి షిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీమహాక్ష్మి అలంకరణ



బంగారుపాళ్యం: మహాలక్ష్మిగా బోయకొండ గంగమ్మ


శాకంబరీదేవిగా శ్రీమానసాదేవి


నగరిలో మహాలక్ష్మిగా దేశమ్మ


కార్వేటినగరం: మహాలక్ష్మీదేవి అలంకరణలో బంగారమ్మ


జీడీనెల్లూరు: అన్నపూర్ణేశ్వరిగా అల్లియల్లమ్మ


పెనుమూరు: శాకంబరిగా ప్రసన్న పార్వతీదేవి


తవణంపల్లిలో అన్నపూర్ణాదేవి


కరుమారియమ్మగా శ్రీగోవిందమ్మ


చిత్తూరులో దుర్గామాతకు పూజలు చేసిన విజయం డిగ్రీ కళాశాల విద్యార్థినులు

మీనాక్షమ్మ.. అనుగ్రహించవమ్మా

దేవీ నవరాత్రి ఉత్సవాలు చిత్తూరు, నగరి, పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవర్లు వివిధ రూపాల్లో అలంకృతులై భక్తుల్ని అనుగ్రహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. -న్యూస్‌టుడే బృందం

బకాయి చెల్లించాలని ఫ్లెక్సీ ఏర్పాటు

నింద్ర, న్యూస్‌టుడే: నింద్ర మండలం కొప్పేడు వద్ద ఉన్న నేటమ్స్ షుగర్స్ యాజమాన్యం రైతులకు సంవత్సరాలు గడుస్తున్నా బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు మంగళవారం తెదేపా నేతలు కంపెనీ ప్రధాన గేటు వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెదేపా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోటి, ప్రసన్న, రవినాయుడు, దేవ, దేవన్ పాల్గొన్నారు.


ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న తెదేపా నేతలు

వికసిత్ భారత్ దిశగా అడుగులేద్దాం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వికసిత్ భారత్ దిశగా అడుగులు వేసి బాల్య వివాహాలను అరికడుదామని ఐసీడీఎస్ పీడీ హైమావతి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 31, 39పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీసు శిక్షణ కేంద్రంలో మహిళా పోలీసులు, బాల్య వివాహాల నిరోధక అధికారులకు డివిజన్ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హైమావతి

యాదమరికి మద్యం దుకాణం కేటాయించాలి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వం పూతలపట్టు నియోజకవర్గంలోని కల్లుగీత కార్మికులు అధికంగా ఉండే యాదమరి మండలానికి ప్రత్యేకంగా మద్యం దుకాణాన్ని కేటాయించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిగౌడ్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి లేకేష్, తెలుగునాడు కల్లుగీత అధ్యక్షులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీలు పరిశీలించి రద్దు చేయాలి

నగరి, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బందులు కలిగించే క్వారీలను అధికారులు పరిశీలించి అనుమతులను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. కీళ్లపట్టు సమీపంలోని క్వారీల వద్ద సీపీఐ నాయకులు, గ్రామస్థులు మంగళవారం నిరసన తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ కార్యదర్శి షబ్బీర్ బాషా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులను వేధించరాదు

జీడీనెల్లూరు: ఎయిడ్స్ బారిన పడిన రోగులను వేధించరాదని సీఐ లక్ష్మీనారాయణ ప్రజలను కోరారు. మంగళవారం కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ పద్ధతులపై స్టేషన్ ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంస్థ ప్రాజెక్టు మేనేజరు సద్దాం, సమన్వయకర్త రేవతి, ఏఎస్సై ఆంజనేయులరెడ్డి పాల్గొన్నారు.

శిరస్త్రాణం ధరించి ప్రమాదాలు నివారించండి

నగరి, న్యూస్‌టుడే: గుండ్రాజుకుప్పంలో ఆర్డీవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకపోతే కలిగే నష్టాలను సీఐ మహేశ్వర్ వివరించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, సర్పంచి బాలప్రసాద్‌రెడ్డి, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్న 22వ డివిజన్(తేనెబండ) ప్రజల సమస్యను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిష్కరించారు. మంగళవారం బోరు వేయించగా, పుష్కలంగా మంచి నీరు రావడంతో స్థానికులు ఎమ్మెల్యే చిత్రపటంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో మురుగు కాలువ నీరు కలుషితమైందని, తద్వారా చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ తరచూ చర్మ వ్యాధులకు గురై ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే తమ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో సమస్యను ఆయనకు విన్నవించగా, ఇచ్చిన మాట ప్రకారం బోరు వేయించి పరిష్కారం చూపినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే చిత్రపటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కాలువలా.. అవెక్కడా..!


వేలూరు మార్గంలో రోడ్డుపై మురుగు

చిత్తూరు నగరంలోని వేలూరు రోడ్డులో ఉన్న అమూల్ పాల డెయిరీ ఎదురుగా కొన్నేళ్లుగా మురుగు కాలువలు లేవు. దీంతో పరిసర ప్రాంతాల్లోని మురుగు నీరు రోడ్డుపైకి వస్తుండటంతో ప్రధాన రహదారి వెంట ప్రవహిస్తోంది. ఈ నీరు పారటంతో రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఒక్కోసారి దీనికి వర్షపు నీరు తోడయితే కనీసం రాకపోకలు సాగించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇక్కడ మురుగు కాలువలు నిర్మించి తమ సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.


మురుగునీటితో దెబ్బతిన్న రహదారి

-ఈనాడు, చిత్తూరు

ఎలక్ట్రికల్ దుకాణం దగ్ధం

నగరి, న్యూస్‌టుడే: నగరి పట్టణం పుదుపేటలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఎలక్ట్రికల్ వస్తువులు విక్రయించే దుకాణం దగ్ధమైంది. అరుణగిరి అనే వ్యక్తి ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతు, వస్తువుల విక్రయంతో జీవనాధారం పొందుతున్నాడు. సోమవారం రాత్రి ప్రతి రోజులా దుకాణం మూసి వెళ్లగా.. అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో వస్తువులన్నీ కాలిపోయాయి. ఆర్థికంగా నష్టపోయిన అతనికి ప్రభుత్వం ఆదుకోవాలని ఎలక్ట్రీషన్ల అసోసియేషన్ అధ్యక్షుడు రవి కోరారు.

సారా రవాణా: వ్యక్తి అరెస్టు

నగరి, న్యూస్‌టుడే: నగరి మండలం గుండ్రాజుకుప్పం వద్ద సారా రవాణా చేస్తున్న అడవికొత్తూరుకు చెందిన శ్రీనివాసులును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. అతని నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

చినుకు పడితే చిత్తడే...!



చిన్నపాటి వర్షం కురిసినా చవరంబాకం గ్రామానికి వెళ్లే రోడ్డుపై నీరు చేరి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు ఆధునికీకరణ పనుల కోసం నిధులు మంజూరైనా వైకాపా పాలనలో పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం ద్విచక్ర వాహనంలో వెళ్లాలన్నా తిప్పలేనని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత ఏఈలు సైతం ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. కొత్తగా వారు వచ్చి బాధ్యలు చేపడితే తప్ప.. ఆయా పనులు పూర్తికాని పరిస్థితి.
-న్యూస్‌టుడే, నింద్ర

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు



వైద్యులకు సూచనలిస్తున్న డీసీహెచ్ఎస్ ప్రభావతి

వైద్యులు సమయపాలన పాటించాలి

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ ప్రభావతి అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రి నుంచి జిల్లా కేంద్రానికి అనవసరంగా కేసులు రెఫర్ చేయరాదని సూచించారు. వైద్యులు యుగంధర్, మమతరాణి, శారద పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు

చౌడేపల్లె: మహిళలకు సమాన హక్కులున్నాయని న్యాయవాదులు వెంకటరమణ, సి.వి.రమేష్‌బాబులు తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు హనుమంతు, ఏపీఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చెరువు మట్టి తీస్తే ప్రమాదాలకు ఆస్కారం



కామినాయనిపల్లె చెరువులో మట్టి తవ్వకాలు పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారిలో కామినాయనిపల్లె చెరువు కట్ట ఆనుకుని మట్టి తవ్వకాలు చేస్తే ప్రమాదాలకు ఆస్కారముందని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఈ మార్గంలో మంగళవారం ఆయన వెళ్తూ మట్టి తవ్వకాలు పరిశీలించారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే రహదారి నిర్మాణ గుత్తేదారు కామినాయనిపల్లె చెరువులో నిబంధనలకు యంత్రాలతో మట్టి తవ్వడం సరికాదన్నారు. కట్టకు సమీపంలోనే 40 అడుగుల లోతు తవ్వకాలు జరపడంతో వాహన చోదకులు అదుపుతప్పితే ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. జలవనరుల శాఖ అధికారులకు ఫోన్ చేసి వారి చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన కార్యకర్తలు తరలిరావాలి



మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ

పుంగనూరు, న్యూస్‌టుడే: టిడ్కో ఛైర్మన్, జనసేన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ అజయ్‌కుమార్ గురువారం పుంగనూరు పట్టణ, గ్రామీణంలో పర్యటిస్తారని కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పగడాల రమణ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చదళ్లలో చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విరూపాక్షి పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీరామచంద్రస్వామి విహారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో మంగళవారం హనుమంత వాహనంపై స్వామివారు విహరించారు. మూలవిగ్రహాలకు అభిషేకం, పుష్పాలంకరణ, మంటపోత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ వేడుకగా జరిగింది.

చెరువులు ఖాళీ.. గుండెలు జారి

- బీళ్లుగా మారిన పంట పొలాలు
- నీరు లేక నెర్రెలిచ్చిన చెరువులు
- భూగర్భ జలాలు పాతాళానికి

పుంగనూరు, సోమల, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్లు రైతులకు అనుకూలించలేదు. అదిగో.. ఇదిగో.. అంటూ వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే మిగులుతోంది. మెట్ట ప్రాంతాల్లో బోర్లు వేసుకుని సాగుచేయాలని భావించినా భూగర్భజలాలు పాతాళానికి చేరుకున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా పాతిక శాతం చెరువుల్లోనూ నీటి నిల్వలు లేవు. సాగు భూములే కాదు పలు గ్రామాల పరిధిలో చెరువులు, కుంటలు నెర్రెలిచ్చి రైతులకు గుండెకోత మిగుల్చుతున్నాయి.

జలవనరుల పరిస్థితి ఇలా..

నియోజకవర్గంలో 1433 చెరువులు, కుంటలున్నాయి. వాటి కింద వరి, చెరకు, రాగి, మొక్కజొన్న వంటి పంటలు 17,900 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. అయితే ఈ సీజన్‌లో వర్షాపాతం లోటు తీవ్రంగా కనిపించింది. దీంతో సాధారణ సాగుకు చాలా తక్కువగా కేవలం 7వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. అందులోనూ బోర్ల కింద సాగు చేసినవే ఎక్కువ.

నీటి వనరుల్లో.. ప్చ్

నియోజకవర్గంలో 30 వేల బోరుబావులు ఉన్నాయి. ఇందులో 6500 బోర్లు పూర్తిగా ఎండిపోయినట్లు అధికారిక లెక్కలు. ఇంకా చాలా వాటిల్లో నీటి పరిమాణం తగ్గిపోయింది. వంద ఎకరాల కంటే ఆయకట్టు కలిగిన 56 చెరువులు, 100ఎకరాలకు తక్కువున్న 1377 చెరువులు, కుంటల్లో సింహభాగం ఎండిపోయాయి. పలు చెరువులు ముళ్లపొదలతో రూపురేఖలు అదృశమయ్యాయి. ఫలితంగా మెట్ట పంటల సాగుభూములన్నీ బీటలు బారాయి. చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడంతో పలు చోట్ల పశువులకు తాగునీరు లభించడం లేదు.

మండలాల వారీగా చెరువుల ఆయకట్టు సాగు వివరాలు

మండలం	చెరువులు	సాధారణ సాగు హెక్టార్లు	సాగైన హెక్టార్లు
పుంగనూరు	212	6000	1700
చౌడేపల్లె	228	2500	1400
సోమల	289	3700	1350
సదుం	380	2100	850
పులిచెర్ల	220	2000	900
రొంపిచెర్ల	184	1600	800



సోమల: క్రిష్ణాజమ్మ కుంటలో నీళ్లు లేక వదిలేసిన వినాయక ప్రతిమ



ఖాళీగా దర్శనమిస్తున్న కాటిపేరి చెరువు

వేధిస్తున్న పశుగ్రాసం కొరత

గత రబీలో వరి పండకపోవడంతో ఎండు గడ్డి కొరత ఏర్పడింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావం పాడిపరిశ్రమ, రైసుమిల్లులు, కుటీర, చేతివృత్తులపై ప్రభావం చూపుతున్నాయి. నియోజకవర్గంలో వరుణుడి కరుణ కరువైంది. చెరువులు, కుంటలు వట్టిపోవడంతో పశువులకు సైతం ఇళ్ల దగ్గరే తాగునీరు అందించాల్సిన దుస్థితి. ఖరీఫ్‌లో విత్తిన వేరుసెనగ నీటితడి లేక దిగుబడులు తగ్గిపోయాయి. బోర్ల ఆదరవు లేకపోతే వరిసాగు లేదు. వాణిజ్య పంటల తోటలు, కూరగాయలు, ఆకుకూరలు సాగు నామమాత్రమే. ఈ ప్రభావంతో రానున్న వేసవిలో తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రబీలో వరి వద్దు: చెరువుల్లో, కుంటల్లో నీటి మట్టం తగ్గింది. రానున్న రబీలో బోర్ల దగ్గర వరి సాగు వద్దు. నీటి మట్టాలు అడుగంటితే ఇబ్బందు వస్తాయి. ఆరు తడి పంటలు సాగు చేసుకుంటే ఉత్తమం. నీటి ఆదాతో పాటు ఖర్చుకు తగ్గ ఆదాయం పొందే అవకాశం ఉంది.

- శివకుమార్, ఏడీఏ, పుంగనూరు

సదుం, న్యూస్‌టుడే:
సమస్య: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా ఆ ప్రాంత వాసులే చెత్త వేస్తున్నారు. దీంతో అక్కడ దుర్వాసన వస్తుంది. **- స్థానికులు**
సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తాం. **-హసీనా, పంచాయతీ కార్యదర్శి, సదుం**

పుంగనూరు, న్యూస్‌టుడే:
సమస్య: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం నుంచి తాటిమాకులపాళ్యంనకు వెళ్లే మార్గంలో వీధి దీపం ఏర్పాటు చేయాలి. కౌండిన్య కాలువ, వంతెన ఉండడంతో వెలుతురు లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- మునిరాజ, ఎంఎస్ఆర్ వీధి, పుంగనూరు**
సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- మధుసూదనరెడ్డి, పురపాలక కమిషనరు**

పెద్దపంజాణి, న్యూస్‌టుడే:
సమస్య: పంచాయతీ కేంద్రంలోని ప్రధానవీధి ముత్యాలమ్మ ఆలయం వద్ద మలుపులో నీరు నిలుస్తుంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. **- శ్రీనివాసులు, పెద్దపంజాణి**
సమాధానం: నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి**

పలమనేరు, న్యూస్‌టుడే:
సమస్య: మున్సిపల్ పరిధిలోని గొబ్బిళ్ళకోటూరు రోడ్డు దుస్థితిలో ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. గుంతలతో నడవటానికి వీల్లేకుండా మారింది. **-సుబ్రహ్మణ్యంగౌడు, పలమనేరు**
సమాధానం: మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. **-ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్**

తాగునీటి సమస్యకు పరిష్కారం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని నెక్కుంది పంచాయతీ పెద్ద అల్లాపురంలో మంగళవారం బోరు మోటారుకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను సర్పంచి నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బసవరాజ పరిష్కరించారు. వారం కిందట మంచినీటి బోరు మరమ్మతులకు గురైంది. స్థానికుల ఫిర్యాదుతో ఈ నెల 8న మేమున్నాం.. మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు.

మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు

స్పందనకు వందనం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణం రాజీవ్ కాలనీలో కాల్వలేక మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఇది నేరుగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు వెళ్తూ ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తుంది. గతవారం ఈ సమస్యను స్థానికుల ఫిర్యాదుతో మేమున్నాం.. మీకుతోడుగా శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు స్పందించి మురుగు కాలువకు మరమ్మతులు చేయించి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

స్టిక్కర్ల తొలగింపు

పట్టణం ప్రధాన రహదారిలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాయకుల పేర్లపై స్టిక్కర్లు అతికించారు. ఎన్నికలు పూర్తై కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా అధికారులకు కనిపించలేదంటూ స్థానికుల ఫిర్యాదుతో వార్త ప్రచురితమైంది. కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బందితో మంగళవారం స్టిక్కర్లు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.



బీటీ రోడ్డు నీటి మడుగులా మారడంతో పాదచారుడి కష్టాలు



నీటిగుంటలా మారిన రహదారిలో ప్రయాణిస్తున్న కారు

ఆ మార్గంలో.. ప్రయాణం నరకమే..!

మండల పరిధి మటార్లపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. వేపనపల్లి రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు అధిక టన్నేజీ గ్రానైట్ లారీల తాకిడికి పూర్తిగా దెబ్బతింది. దీనివల్ల వర్షాకాలం వస్తే ఆ రోడ్డు మడుగును తలపిస్తుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం బారిన పడతారు. వర్షాకాలంలో పాదచారులు సైతం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

వైకాపా పాపం.. దండగమారి వ్యయం..!



మండల పరిధి ఎంకేపురంలో మూతపడిన తనిఖీ కేంద్రం దుస్థితి ఇది. వైకాపా పాలనలో కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా అంతర్రాష్ట్ర మార్గాల్లో అక్రమ రవాణా అరికట్టేందుకు 30 చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వాటికి రూ. లక్షల్లో ప్రభుత్వ ధనం వెచ్చించారు. జీరో దందాను నివారించాలనే లక్ష్యం.. నిర్వహణ భారంతో కేంద్రాలు తేలిపోయి మూతపడ్డాయి. సీసీ కెమెరాలు, ఇతర సామగ్రి చోరుల పాలయ్యాయి. ఇనుప షెడ్లు తుప్పు పడుతున్నాయి. పాలకుల అనాలోచిన నిర్ణయం పుణ్యమాని ప్రభుత్వం సొమ్ము వృథా ఖర్చుగా మారిందని విమర్శిస్తున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం



నెక్కుంది: పూలసాగులో మెలకువలు తెలుపుతున్న పీడీ బాలమురగన్

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై పలు పథకాలు అందిస్తోందని జిల్లా ఏపీఎంఐపీ పీడీ బాలమురగన్ తెలిపారు. మండలంలోని నెక్కుంది గ్రామంలోని మంగళవారం 'పొలం పిలుస్తోంది' రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిందు సేద్యం, ఉద్యాన పంటల రాయితీలు వివరించారు. ఏడీఏ శివకుమార్, ఏవో ఫయాజ్ పాల్గొన్నారు. **సోమల:** యువశాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకొని బాధ్యతగా అవగాహన కల్పించాలని సీనియర్ శాస్త్రవేత్త పుష్పా పేర్కొన్నారు. మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలో రామిశెట్టి మహేష్ కుమార్ పొలంపై అవగాహన కల్పించారు. **శాంతిపురం:** పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని పలమనేరు సహాయ సంచాలకురాలు అన్నపూర్ణ, ఏఓ అప్సోజీ సూచించారు. కడపల్లె, పాకంపల్లె, కదిరిఓబనపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టుశాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. **కల్లూరు:** నీటి పొదుపుతో అధిక దిగుబడి సాధిస్తే లాభాలు పొందవచ్చని వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కావేటిగారిపల్లె, గెలసంవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుంగనూరు: ప్రత్యేకాలంకారంలో అష్టలక్ష్మీదేవతలు



పుంగనూరు: జీడిపప్పు అలంకరణ



కల్లూరులో.. ధనలక్ష్మీగా



కుప్పంలో..



కందూరులో మహిళల పూజలు



పలమనేరులో..



పెద్దపంజాణి: శ్రీరామాపురంలో..

జగమేలు తల్లి.. కల్పవల్లి

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారు ధనలక్ష్మీ దేవీ అలంకరణలో భక్తులను కటాక్షించారు. మూడు పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకుంది.



బైరెడ్డిపల్లెలో..



సదుంలో..

బోయకొండను మరింత అభివృద్ధి చేస్తా



బోయకొండ గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన బోయకొండ మాజీ ఛైర్మన్లు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు దీవెనలుంటే బోయకొండను మరింతగా అభివృద్ధి చేస్తామని బోయకొండ మాజీ ఛైర్మన్లు ఎస్.కె.రమణారెడ్డి, ఆయన సతీమణి రతీదేవి పేర్కొన్నారు. మంగళవారం దంపతులు గంగ్మమకు దసరా మహోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పలు ఆరోపణలు చేశారు. బీసీ నాయకుడు మనోహర్ పాల్గొన్నారు.

మురుగు పరుగు.. రోగాలతో బెరుకు



మండల పరిధి నేతిగుట్లపల్లె పంచాయతీ ఎర్రగుంట్లపల్లె గ్రామంలో గత వైకాపా ప్రభుత్వంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. మురుగునీటి కాలువలు మరిచారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధుల్లో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దోమలు, క్రిములతో తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది వెంటనే కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లీలామాధవి మంగళవారం మాట్లాడుతూ.. కాలువల నిర్మాణానికి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బాలాజీ

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: నూతన ఎంపీడీవో కేఎన్ బాలాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అబ్దుల్ రహీం అన్నమయ్య జిల్లా కలకడకు బదిలీపై వెళ్లారు. అదే జిల్లాలో పెద్ద తిప్పసముద్రంలో పనిచేస్తూ బాలాజీ ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.

బదిలీ ఆపాలి

శాంతిపురం: గుడుపల్లె మండలంలోని కంచి బందార్లపల్లె వీఆర్ఓ ధనుంజయ బదిలీని నిలుపుదల చేయాల్సిందిగా కోరుతూ ప్రజలు కుప్పం ఆర్డీవోకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. కంచిబంద్లాపల్లె పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ.. రెవెన్యూ సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న అతణ్ని బదిలీ చేయరాదని వారు విజ్ఞప్తి చేశారు.

పశు వైద్యశిబిరం..

సదుం: తాటిగుంటపాళెం పంచాయతీ ఎర్రగుంట్లవారిపల్లెలో పశువులకు ఉచితగర్భకోశవ్యాధి చికిత్సలు నిర్వహించారు. 90 పశువులకు చికిత్సలు అందించినట్లు పశువైద్యాధికారి సుబ్రమణ్యం తెలిపారు. మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు.

మానసిక వ్యాధిగ్రస్థులకు సరైన చికిత్స



అవగాహన కల్పిస్తున్న వైద్య నిపుణులు జాహ్నవి, ప్రణీత, వేదవతి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మానసిక వ్యాధిగ్రస్థులకు చికిత్స అందిస్తే త్వరగా కోలుకుంటారని కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్య నిపుణులు జాహ్నవి అన్నారు. తీర్థం పీహెచ్‌సీలో మంగళవారం ఆశాకార్యకర్తల సమావేశంలో ఆమె అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం, ఇతర మత్తు పదార్థాలు అతిగా వాడితే వచ్చే అనర్థాలు, సమస్యలు వివరించారు. ఇలాంటి వారికి సకాలంలో సరైన చికిత్స అందించాలన్నారు. వైద్యాధికారి పద్మావతి, వైద్య నిపుణులు ప్రణీత, వేదవతి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు గాయపడిన ఘటన చౌడేపల్లెలో మంగళవారం జరగింది. చౌడగుట్టపల్లెకు చెందిన జయప్రకాష్ (23) అయ్యప్ప దీక్ష చేపట్టారు. సదుం అయ్యప్పస్వామి ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు తన సోదరి స్వాతి (19), బామ్మర్ది విక్కీ (9)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా సింగిరిగుంట మలుపులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మదనపల్లెలో చికిత్స పొందుతున్నారు.

కల్వర్టులు శిథిలం.. ప్రయాణికులకు భయం



కొంగోళ్లపల్లె రోడ్డులో దుస్థితికి చేరిన కల్వర్టు

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం రహదారుల అభివృద్ధి విస్మరించి.. మరమ్మతులు, నిర్వహణ మరిచిపోయింది. గ్రామీణ రహదారులపై పూర్తిగా నిర్లక్ష్యం చూపింది. దీంతో చాలా రహదారులు దెబ్బతిన్నాయి. ఇందులో గ్రామీణ రహదారుల్లోని కల్వర్టులు శిథిల దశలో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

తాత్కాలిక పనులతో సరి

నియోజకవర్గం పరిధిలో 2022లో కురిసిన వర్షాలకు కౌండిన్యపై పలు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. నీటి ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయి దారి లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఆర్అండ్‌బీ అధికారులు వాటికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. మట్టి, రాళ్లు పోసి తెగిపోయిన కల్వర్టులు తాత్కాలికంగా నిర్మించారు. శాశ్వత నిర్మాణాలు చేపట్టకపోవడంతో అవి ప్రస్తుతం మరింత దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఆ ప్రాంతంలో చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటిని ఒడిసి పట్టోచ్చు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి.

పలు చోట్ల మరీ అధ్వానం

గంగవరం మండలం కొంగోళ్లపల్లె- పలమనేరు దారిలో కౌండిన్యపై కల్వర్టు కొట్టుకుపోయింది. 10 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. తాత్కాలికంగా ఇసుక, మట్టి నల్లటి రాళ్లు అడ్డుపెట్టారు. పలమనేరు మండలంలోని సముద్రపల్లె వద్ద కూడా కల్వర్టు ఇదే పరిస్థితిలో ఉంది. కురపల్లె వద్ద కూడా తాత్కాలిక నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. కన్నమాకులపల్లె దారిలోని కల్వర్టు దెబ్బతింది.

ప్రతిపాదనలు పంపుతాం.. విషయం మాదృష్టికి వచ్చింది. నూతన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం. **- రాధిక, డీఈఈ, ఆర్అండ్‌బీ, పలమనేరు**

వరిని తొక్కేసిన ఏనుగులు



పాతపేటలో ధ్వంసమైన వరి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో ఏనుగుల మంద సంచరిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శివారులోని పొలాలపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. సోమవారం రాత్రి దేవళంపేట పంచాయతీ అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన ఏనుగులు గెండోళ్లపల్లె గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి వరి, లక్ష్మీరెడ్డి పశుగ్రాసం, విజయసారథినాయుడు బోరుబావి పైపులు ధ్వంసం చేశాయి. దిగువమూర్తివారిపల్లె నాగరాజ మామిడి తోటలో 15 చెట్ల కొమ్మలు విరిచాయి. పాతపేటలో ఎకరా వరిని తొక్కేశాయి. ఎద్దలవారిపల్లె సమీపంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది.

పాఠశాల అభివృద్ధికి కృషి



పెద్దచెల్లారగుంట జడ్పీహెచ్ఎస్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు, ఆనాటి గురువులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పుట్టిన ఊరు, చదివిన బడిని ఎన్నటికీ మరువరాదని పెద్దచెల్లారగుంట జడ్పీహెచ్ఎస్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జగదీష్ పిళ్లై అన్నారు. పాఠశాలలో 2007-08 పది విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని గురువులతో సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు.